క్లుప్తంగా

నాసిరకంగా రోడ్డు పనులు



రోడ్డుకు ఇరువైపులా కాలువ మట్టిని తోలిన వైనం

అనుమసముద్రంపేట : మండలంలోని ముస్తాపురం– హసనాపురం మధ్య ఆర్‌అండ్‌బీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న తారురోడ్డు పనులు నాసిరకంగా జరుగుతున్నట్లు తీవ్రస్థాయిలో విమర్శలు వస్తున్నాయి. దాదాపు 18 కిలోమీటర్ల మేర రూ.9 కోట్ల వ్యయంతో తారురోడ్డు నిర్మాణం చేపడుతున్నారు. మండలానికి ఉండాల్సిన ఆర్‌అండ్‌బీ ఇంజినీర్ గత కొన్ని నెలలుగా లేకపోవడంతో ఆయన స్థానంలో మర్రిపాడు ఏఈకి బాధ్యతలు అప్పగించారు. అయితే 2013–14లో ఈ రోడ్డు పనులు చేసిన కాంట్రాక్టర్‌కే తిరిగి రోడ్డు పనులు అప్పగించారు. గతంలోనే రోడ్డు పనులు నాసిరకంగా వేశారని ప్రజలు గగ్గోలు పెట్టారు. అయినప్పటికీ అదే కాంట్రాక్టర్‌కు అప్పగించడంతో రోడ్డు తీరు మారిపోయింది. దీంతో పాటు రోడ్డుకు ఇరువైపులా గ్రావెల్ తోలాల్సి ఉండగా సదరు కాంట్రాక్టర్ కాలువల్లోని మట్టి తీసి రోడ్డుకు ఇరువైపులా వేస్తున్నారు. ఇదేమని ప్రశ్నిస్తున్న ప్రజలకు ప్రభుత్వ జీఓలో మట్టి వేయాలని ఉందని, దాని ప్రకారమే వేస్తున్నట్లు సమాధానం చెబుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

సంగం : మండలంలోని సిద్దీపురం పంచాయతీ మజారా అనసూయనగర్‌లో ఉన్న పోలేరమ్మ తల్లి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇక్కడ అమ్మవారిని ప్రతిష్ఠించి ఏడాది పూర్తికావడంతో వార్షికోత్సవాలు చేస్తున్నారు. ఈ క్రమంలో అమ్మవారికి వివిధ ద్రవ్యాలతో అభిషేకాలు చేసి విశేష పూలతో సుందరంగా అలంకరించారు. గ్రామంలోని ప్రజలంతా విచ్చేసి తమను కాపాడాలంటూ అమ్మవారిని మొక్కుకున్నారు. అనంతరం కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులు ఇచ్చారు.

6న కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు



పశువైద్యాధికారి రాఘవేంద్రశర్మ

వరికుంటపాడు : మండలంలోని పశువైద్యశాలల పరిధిలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 6వ తేదీన పెంపుడు, వీధి కుక్కలకు ఉచితంగా యాంటీ రేబిస్ టీకాలు వేస్తారని మండల ఇన్‌చార్జి పశువైద్యాధికారి ఎస్వీఎస్ రాఘవేంద్రశర్మ బుధవారం తెలిపారు. మండలంలో సుమారు 2000 కుక్కలు ఉన్నాయని, తప్పనిసరిగా టీకాలు వేయించాలని కోరారు.

ప్రొటోకాల్ పాటించాలి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సురేష్

కలిగిరి : మండలాధికారులు ప్రొటోకాల్ పాటించాలని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తెలిపారు. కలిగిరిలోని ఎంపీడీఓ కార్యాలయాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. అధికారులతో పలు విషయాలపై చర్చించారు. గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. నేషనల్ హైవే నిర్మాణంలో భాగంగా కలిగిరిలో విస్తరణ పనులు చేపట్టకుండా బైపాస్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై పూర్తిస్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రంగసుబ్బరాయుడు, తహసీల్దార్ బాలకిశోర్, ఏపీఓ శ్రీనివాసులు, టీడీపీ మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి



చేజర్ల : రోగులకు వైద్యసేవలు అందిస్తున్న గిరీష్



ఆత్మకూరు : చేతుల శుభ్రతపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నారాయణమ్మ

చేజర్ల : వర్షాకాలం నేపథ్యంలో ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని చేజర్ల పీహెచ్‌సీ వైద్యుడు గిరీష్ అన్నారు. మండలంలోని పాతపాడు గ్రామ సచివాలయంలో 104 ద్వారా రోగులకు బుధవారం వైద్య సేవలు అందించారు. సుమారు 60 మంది రోగులకు బీపీ, షుగర్, రక్త పరీక్షలు చేసి ఉచితంగా మందులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డయేరియా, డెంగీ వ్యాధి పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పరిశుభ్రమైన నీటిని తీసుకోవాలన్నారు. జింక్ మాత్రలు తీసుకోవడం మంచిదన్నారు. దోమల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. జ్వరం, తలనొప్పి, కీళ్ల నొప్పులు, శరీరంపై దద్దుర్లు వచ్చినా వైద్యులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ చంద్రయ్య, ఎంఎల్‌హెచ్‌పీ రేవతి, ఏఎన్ఎం మహాలక్ష్మి, ఆశా వర్కర్ రమణమ్మ పాల్గొన్నారు.

అశ్రద్ధ వద్దు

ఆత్మకూరు : డయేరియా, నిమోనియా తదితర సీజనల్ వ్యాధుల పట్ల అశ్రద్ధ చేయకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూరు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కేశవ నారాయణమ్మ అన్నారు. మండలంలోని పమిడిపాడు అంగన్‌వాడీ కేంద్రంలో సీజనల్ వ్యాధుల పట్ల ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు సంక్రమించకుండా ప్రతిఒక్కరూ కాచిచల్లార్చిన నీటిని తాగాలన్నారు.

చేతులను శుభ్రం చేసుకున్న తరువాతే భోజనాలు చేయాలని, మలవిసర్జన తరువాత కూడా చేతుల శుభ్రత పాటించాలన్నారు. అనంతరం గిరిజన చిన్నారి పల్లవి పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చేతుల శుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పమిడిపాడు, నబ్బీనగరం అంగన్‌వాడీ టీచర్లు శ్రీదేవి, రత్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వేట సామగ్రి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న సామగ్రితో ఫారెస్ట్ అధికారులు

వరికుంటపాడు : వరికుంటపాడు మండల పరిధిలోని తూర్పు రొంపిదొడ్ల ఎస్టీ కాలనీలో వన్య ప్రాణులను వేటాడే ఉచ్చులు, వలలు, ఇతర సామగ్రిని అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ మునీర్‌బాబు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. ఉదయగిరి అటవీ రేంజ్ అధికారి తుమ్మల ఉమామహేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో వేట వస్తువులను స్వాధీనం చేసుకుని పలు సూచనలు సలహాలు అందించారు. ఎవరైనా వన్యమృగాలను వేటాడి చంపితే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వారి వెంట బీట్ అధికారులు నాయబ్ రసూల్, కరిముల్లా ఉన్నారు.

ఇన్‌చార్జి ఎంఈఓగా జ్యోతి



ఎంఈఓ జ్యోతిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఆత్మకూరు : ఆత్మకూరు మండల ఇన్‌చార్జి విద్యాశాఖాధికారిగా ఎం.జ్యోతి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పట్టణంలోని ఎంఈఓ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన ఆమెను పలు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, మహిళా ఉపాధ్యాయులు కలిసి అభినందనలు తెలిపారు. ఆత్మకూరు ఎంఈఓ ఇటీవల పదవీ విరమణ చేయడంతో ఆ స్థానంలో అనుమసముద్రంపేట రెగ్యులర్ ఎంఈఓగా విధులు నిర్వహిస్తున్న ఆమెకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఆమెను ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘంతో పాటు పలు ఉపాధ్యాయ సంఘాల నేతలు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలు కప్పి సత్కరించారు. అనంతరం ఇన్‌చార్జి ఎంఈఓ జ్యోతి మాట్లాడుతూ పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు పూర్తి స్థాయిలో పంపిణీ చేయాల్సి ఉందని, ఇంకా అందని పాఠశాలల వివరాలను తన దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయినులు వెంగమ్మ, కళావతి, హరిత, శ్రీలత, కామేశ్వరి, కల్పన, సీతాదేవి, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎ.సురేంద్రరెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఆర్.వెంకటేశ్వర్లురెడ్డి, మండల శాఖ అధ్యక్షుడు నరేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ ఆఫీసర్‌కు సన్మానం



కార్యక్రమంలో ఉపాధ్యాయులు శార్వాణి, అంజాద్ అలీ, ఐ.శ్రీనివాసులు, సుమన, సుబ్బయ్య, ఏసురత్నం, ఫణీ, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం మహబూబ్ మస్తాన్, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

కావలి : పట్టణంలోని వెంగళరావునగర్‌లో ఉన్న పురపాలక ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడు, ఎన్‌సీసీ థర్డ్ ఆఫీసర్ తిప్పిరెడ్డి కొండారెడ్డిని బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం హయ్యూమ్ మాట్లాడుతూ మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో రెండు నెలల కఠోర శిక్షణను పూర్తి చేసుకుని, జూన్‌లో వాకాడు మండలం విద్యానగర్‌లో ఉన్న ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్‌సీసీ నాలుగో వార్షిక శిక్షణా శిబిరంలో 10(ఏ) నావెల్ యూనిట్ నెల్లూరు కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కమాండర్ గణేష్ చేతుల మీదుగా థర్డ్ ఆఫీసర్ ర్యాంక్ పొందినట్లు తెలిపారు.

రిటైర్డ్ ఉద్యోగులకు సత్కారం



చేజర్ల : రిటైర్డ్ ఏఎస్‌డబ్ల్యూఓను సత్కరిస్తున్న ఎంపీపీ



ఉదయగిరి : గండిపాళెం ప్రాథమిక పాఠశాలలో..

చేజర్ల : పొదలకూరు సహాయ సాంఘిక సంక్షేమ శాఖ అధికారిగా పదవీ విరమణ చేసిన దేవిరెడ్డి నరసింహారెడ్డిని చేజర్ల మండల పరిషత్ అధ్యక్షుడు తూమాటి విజయభాస్కర్‌రెడ్డి బుధవారం సత్కరించారు. కలువాయిలోని ఉమామహేశ్వరి కల్యాణ మండపంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో విజయభాస్కర్‌రెడ్డి పాల్గొని ఆయన సేవలను కొనియాడారు.

• ఉదయగిరి : మండలంలోని గండిపాళెం మెయిన్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తూ గత నెల 30న పదవీ విరమణ చేసిన షేక్.జాఫర్‌సాహెబ్‌ను బుధవారం పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పేరెంట్స్ కమిటీ చైర్మన్ పాముల రమాదేవి మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు.

సబ్‌స్టేషన్‌కు ట్రాన్స్‌ఫార్మర్ తరలింపు

సాక్షి ఎఫెక్ట్..



ట్రాన్స్‌ఫార్మర్‌ను తరలిస్తున్న సిబ్బంది

చేజర్ల : మండలంలోని మాముడూరు గ్రామంలో రోడ్డు పక్కన పడి ఉన్న రూ.లక్ష విలువ చేసే ట్రాన్స్‌ఫార్మర్‌ను అధికారులు బుధవారం సబ్‌స్టేషన్‌కు తరలించారు. 'విద్యుత్ హెల్పర్ నిర్లక్ష్యం' పేరిట బుధవారం సాక్షిలో ప్రచురితమైన వార్తపై మండల విద్యుత్ శాఖ ఏఈ ఉడతా మన్మధరావు స్పందించారు. వెంటనే సిబ్బందిని పంపి రోడ్డు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను సబ్‌స్టేషన్‌కు తరలించారు. రైతులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రైవేట్ పాఠశాలల పరిశీలన



సోమశిల : అనంతసాగరం మండల పరిధిలోని ప్రైవేట్ పాఠశాలలను ఎంఈఓ–2 కాటంరెడ్డి ప్రభాకర్‌రెడ్డి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రైవేట్ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఫీజ్ బోర్డులను పరిశీలించి తగిన సూచనలు చేశారు. నిబంధనలు పాటించాలని సూచించారు. ఆయన వెంట ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

పాఠశాలలో నీటి పరీక్షలు



నీటి పరీక్షలు చేస్తున్న హెల్త్ ఆఫీసర్ ఇంద్రజ

సంగం : సంగం మండలం తరుణవాయి జిల్లా పరిషత్ హైస్కూల్లో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఇంద్రజ బుధవారం నీటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల సమీపంలోని ఓవర్‌హెడ్ ట్యాంక్, పంప్ వాటర్‌ను పరీక్షించి తదుపరి పరీక్షల నిమిత్తం పంపించారు. వారి వెంట హెచ్ఎం శ్రీనివాస్ ఉన్నారు.

డిప్యూటీ డీఈఓ ఆకస్మిక తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈఓ గోపాల్

ఆత్మకూరురూరల్ : మండలంలోని వాశిలి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆత్మకూరు డివిజన్ ఉప విద్యాశాఖాధికారి కె.గోపాల్ బుధవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. మధ్యాహ్న భోజనం, నాడు–నేడు పనులను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు తెలియజేశారు. పదో తరగతిలో విద్యార్థులు మంచి మార్కులు సాధించేలా కృషి చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయురాలు వసుంధరదేవి, పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

తేనెటీగల దాడిలో ముగ్గురికి గాయాలు



గాయపడిన సర్వేయర్ నరసింహులు

సోమశిల : అనంతసాగరం మండలం లింగంగుంట ఎస్సీ కాలనీలో తేనెటీగల దాడిలో బుధవారం సాయంత్రం ముగ్గురు గాయపడ్డారు. గ్రామానికి చెందిన పోలుబోయిన సుధాకర్, సచివాలయ ఏఎన్ఎం రత్నమ్మ, సర్వేయర్ నరసింహులకు గాయాలు కాగా వారిని చికిత్స నిమిత్తం అనంతసాగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. డాక్టర్లు వైద్యసేవలు అందించారు.

ప్రతి చిన్నారికి టీకాలు వేయించాలి



టీకా వేస్తున్న వైద్యసిబ్బంది

వరికుంటపాడు : వరికుంటపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని తల్లిదండ్రులు తమ చిన్నారులకు ప్రాణాంతక వ్యాధులు సోకకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని వైద్యశాల కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రాజశేఖర్‌రాజు సూచించారు. మండలంలోని వేయంపాడులో జరుగుతున్న టీకాల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన బుధవారం తనిఖీ చేసి రికార్డులు పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఆరోగ్య కార్యకర్తలు ముందుగా టీకాలు వేసే చిన్నారుల జాబితాను తయారు చేసుకుని అందుబాటులో ఉంచుకోవాలన్నారు. చిన్నారులకు వేసే టీకాల గురించి తల్లిదండ్రులకు వివరించాలన్నారు. ప్రతి చిన్నారికి టీకా వేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం కవిత తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన విద్యార్థులకు పరామర్శ



చిన్నారి గాయాలను పరిశీలిస్తున్న రామిరెడ్డి



ఆరోగ్య పరిస్థితిని ఆరాతీస్తూ..

కావలి : కావలి మండలం ముసునూరు వద్ద ఓ ప్రైవేటు పాఠశాలకు చెందిన బస్సును లారీ ఢీకొన్న ఘటనలో గాయపడిన విద్యార్థులను కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. గాయపడిన విద్యార్థుల్లో కొందరు ఆస్పత్రిలో చికిత్స పొంది డిశ్చార్జ్ కాగా వారి ఇంటికే రామిరెడ్డి నేరుగా వెళ్లి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీశారు. చిన్నారులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో చిన్నారులు గాయపడడం తనను తీవ్రంగా కలిచి వేసిందన్నారు. అలాగే బస్సులో సహాయకుడిగా పనిచేస్తున్న వ్యక్తి మరణించడం ఎంతో బాధాకరమన్నారు. విద్యార్థులకు అన్నిరకాలుగా అండగా ఉంటామని, మరణించిన బస్సు సహాయకుడి కుటుంబాన్ని ఆదుకుంటామని చెప్పారు. ప్రమాద సమయంలో స్థానికులు వెంటనే స్పందించి చేపట్టిన సహాయక చర్యలు ఎంతో అభినందనీయమని, అందువల్లే ప్రాణాపాయం తప్పిందన్నారు. జాతీయ రహదారి సంస్థ కూడా విద్యాసంస్థలు ఉన్న ప్రదేశాల్లో వాహనదారులను అప్రమత్తం చేసేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు, ఇతరత్రా చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు.

విద్యార్థుల హాజరు శాతం పెంచాలి



దుత్తలూరు సెంటర్‌లో మానవహారం చేస్తున్న విద్యార్థులు



రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈఓ మస్తాన్‌వలీ

ఉదయగిరి : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు, హాజరు శాతం పెంచాలని ఎంఈఓ–1 షేక్.మస్తాన్‌వలీ అన్నారు. మండలంలోని అప్పసముద్రం మెయిన్, జెడ్పీ, చవటపల్లి ప్రాథమిక పాఠశాలలను ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. విద్యార్థుల్లో పఠన, అభ్యసన సామర్థ్యాల నైపుణ్యాలను పరిశీలిస్తూ సులభరీతిలో బోధన చేయాలన్నారు. ఆర్వో ప్లాంట్‌లను వినియోగించాలన్నారు. విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలన్నారు. విద్యాప్రవేశం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

విద్యతోనే సామాజికాభివృద్ధి

దుత్తలూరు : విద్యతోనే సామాజిక అభివృద్ధి సాధ్యమని పలువురు వక్తలు అన్నారు. మండల కేంద్రమైన దుత్తలూరు సెంటర్‌లో నేను బడికి పోతా కార్యక్రమంపై బుధవారం అవగాహన ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ బడిఈడు పిల్లలందరినీ బడిలో చేర్పించాలన్నారు. పిల్లలు చదివితేనే వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓలు మస్తాన్‌వలి, వెంగయ్య, ఎంపీడీఓ సురేష్‌బాబు, పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

డెంగీ, డయేరియాపై అవగాహన సదస్సు



అవగాహన ర్యాలీలో వైద్యసిబ్బంది

జలదంకి : జలదంకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సోమవరప్పాడు ఉన్నత పాఠశాల విద్యార్థులకు హెచ్ఎం శేషగిరిరావు ఆధ్వర్యంలో డెంగీ, డయేరియా నివారణపై బుధవారం అవగాహన సదస్సుతో పాటు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్.హరిప్రసాద్ మాట్లాడుతూ ఇంటి ముందు, పరిసరాల్లో వ్యర్థ పదార్థాలు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. నీరు నిల్వ లేకుండా చూసుకోవడం ద్వారా డెంగీ దోమలు ఉత్పత్తి కాకుండా చూసుకోవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ డ్రైడే కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయాలని కోరారు. స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్‌రావు, సీహెచ్ఓ శివ, ఏఎన్ఎం ప్రసన్న, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

హోరాహోరీగా ఎడ్ల బండలాగుడు పోటీలు



బండలాగుడు పోటీలు

కొండాపురం : మండలంలోని గానుగపెంట పంచాయతీ ఆదిమూర్తిపురంలో కొలువైన అన్నపూర్ణ విశాలాక్షి సమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా గ్రామంలో రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలను బుధవారం నిర్వహించారు. హోరాహోరీగా జరిగిన పోటీల్లో మొత్తం 14 జతల ఎడ్లు పాల్గొన్నాయి. నిర్వాహకులు 1,300 కిలోల బండను నిర్ణీత సమయం 15 నిమిషాల్లో లాగిన ఎడ్లకు బహుమతులు ప్రకటించారు. జొన్నవాడకు చెందిన యు.అంకయ్య ఎడ్లు 3,431 మీటర్ల వరకు బండలాగి మొదటిస్థానంలో నిలిచి రూ.25 వేలు గెలుపొందాయి. అలాగే దామరమడుగుకు చెందిన శైలజారెడ్డి ఎడ్లు 3,027 మీటర్లు లాగి రూ.20 వేలు సాధించాయి. గొల్లపల్లికి చెందిన ఎ.శ్రీనివాసులురెడ్డి ఎడ్లు 2,820 మీటర్లు లాగి రూ.15 వేలు గెలుపొందాయి. తూర్పునాగంపల్లికి చెందిన ఎస్.శంకర్‌రెడ్డి ఎడ్లు 2,800 మీటర్లు లాగి రూ.10 వేలు సాధించాయి. తూర్పునాగంపల్లికి చెందిన కృష్ణతేజారెడ్డి ఎడ్లు 2,790 మీటర్లు లాగి రూ.8 వేలు బహుమతి సాధించాయి. అలాగే ప్రకాశం జిల్లా కరేడుకు చెందిన అంకినపల్లి బుల్స్ ఎడ్లు 2,750 మీటర్లు లాగి రూ.5 వేలు సాధించాయి. ఎడ్ల యజమానులకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా సాయంత్రం పలు సాంస్కృతిక, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.